క్లుప్తంగా

వర్షంతో ఉపశమనం



పిఠాపురం- ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప వద్ద నిలిచిన నీరు

కొత్తపల్లి: వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలు గురువారం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. మండల వ్యాప్తంగా సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం కురిసింది. ప్రధాన రోడ్లలో డ్రైనేజీలు పూడికతో మూసుకుపోవడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దేశభక్తిపై విద్యార్థులకు పోటీలు



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు

సామర్లకోట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశభక్తిపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి పెంచేందుకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించామన్నారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని అన్నారు. ఉపాధ్యాయులు కె.గంగాభవానీ, ఎన్.హరినాథ్, పి.బ్రహ్మానందం, పి.నిర్మల, పీఈటీ పి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తును ఆరాధించాలి



ఉపవాస ప్రార్థనల్లో మాట్లాడుతున్న పాస్టర్ జాన్

పెద్దాపురం: పరిశుద్ధ మనసుతో ఆ ఏసుక్రీస్తును ఆరాధించాలని దైవజనులు నంగిన సత్యానందం, అభిషేక్, రాజ్‌కుమార్, వంకా జాన్ అన్నారు. చదలాడ క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఉపవాస ప్రార్థనలు గురువారం ప్రారంభమయ్యాయి. సీజీఎం వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన ఉపవాస ప్రార్థనల్లో వారు మాట్లాడుతూ సర్వమానవాళికి సృష్టికర్త ఏసుక్రీస్తు అన్నారు. ప్రస్తుత సమాజంలో అశాంతి నెలకొందని, ప్రశాంత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మోకరిల్లు ప్రార్థన ఎంతో అవసరమన్నారు. తద్వారా ప్రపంచ శాంతి ఏర్పడుతుందన్నారు. మందిర నిర్వాహకుడు సుదీప్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఉపవాస ప్రార్థనల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. దైవజనులు ఎస్.ఎలిషా, జయకుమార్, దైవజనురాలు నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, కె.విశాల తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటును ఢీకొన్న స్కూటీ



గోపాలపట్నంలో స్కూటీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న రైల్వే గేటు

తొండంగి: మండలంలోని గోపాలపట్నం–తొండంగి ప్రధాన రహదారిలో రైల్వేగేటును గురువారం స్కూటీపై వెళుతున్న వృద్ధ దంపతులు అదుపు తప్పి ఢీకొట్టారు. దీంతో సుమారు మూడున్నర గంటలపాటు గేటు మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. సామర్లకోట రైల్వే ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. గురువారం మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయంలో రైలు వస్తున్న కారణంగా గేటు వేశారు. తొండంగి వైపు నుంచి ఆస్పత్రికి వెళ్లేందుకు వృద్ధ దంపతులు స్కూటీపై వస్తుండగా గేటు దగ్గరకు వచ్చే సరికి గేటు పడిపోవడంతో స్కూటీ అదుపుతప్పి గేటును ఢీకొట్టింది. కింద పడిపోగా స్వల్పగాయాలయ్యాయి. స్కూటీని వదిలి అక్కడి నుంచి పరారయ్యారు. కాగా గేటు లాక్ అవ్వడంతో సాయంత్రం ఆరుగంటల వరకూ గేటు వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఈ రహదారి మీదుగా వెళ్లే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దగ్గరలో ప్రత్యామ్నాయ రహదారి లేకపోవడంతో పి.ఇ చిన్నా యపాలెం గేటు ద్వారా రాకపోకలు సాగించారు. కాగా రైల్వే అధికారులు గేటుకు మరమ్మతులు చేపట్టి సరిచేయడంతో సాయంత్రం నుంచి రాకపోకలు యథావిధిగా సాగాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పాలక వర్గ పోరు !



పిఠాపురంలో శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం

- గుడిలో గంట కొట్టేదెవరు..?
- మహా సంస్థానంలో చైర్మన్ పదవిపై వీడని చిక్కుముడి
- ఆలయ కమిటీలపై ఆధిపత్యం కోసం సిగపట్లు
- ఆలయ పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల

పిఠాపురం: ఆలయ కమిటీల ఏర్పాటుపై కూటమి పార్టీల మధ్య వర్గ పోరు ముదిరి పాకాన పడింది. ఆలయ కమిటీలపై ఆధిపత్యం కోసం సిగపట్లు ప్రారంభమయ్యాయి.కాగా అన్నీ మాకే అని జనసేన అంటుంటే, మాదే పైచేయి అంటు టీడీపీ అంటూ బీజేపీని మాత్రం రెండు పార్టీలు పట్టించుకోడం లేదంటున్నారు. పిఠాపురం పాదగయ, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానాలకు పాలక మండలిని నియమించడానికి గురువారం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఆధ్యాత్మిక కేంద్రమైన పిఠాపురంపై రాజకీయ నాయకుల కన్నుపడింది. ఇక్కడ దక్షిణ కాశీగా విరాజుల్లుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం పాదగయతో పాటు దత్త క్షేత్రాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం, పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన కుంతీ మాధవస్వామి, జైగణేష్ ఆలయాలు ఉన్నాయి. ఈ నాలుగు ప్రధాన ఆలయాలకు ఆలయ కమిటీలను నియమించాల్సి ఉంది. వీటిపై కూటమి నేతలు ఇప్పటికే కన్ను వేసి ఉంచారు. ఎలాగైనా ఆలయ కమిటీల్లో తమ వారిని నియమించుకుని వాటిపై ఆధిపత్యం చెలాయించాలని మూడు పార్టీలు తమ పరిధిలో పైరవీలు ముమ్మరం చేశాయి.

మా మాటేమిటంటున్న వైశ్యులు

మరాఠీలకు ఆరాధ్యదైవంగా వెలుగొందుతున్న శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించింది వైశ్యులే. 1983లో స్థలాన్ని వైశ్యులే కొనుగోలు చేసి ఆలయ నిర్మాణానికి నాంది పలికినట్లు చెబుతున్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన కర్నాటక దత్త భక్తుడు సజ్జనగడ రామస్వామిని ఇక్కడకు తీసుకువచ్చి ఆయన ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి వైశ్యులు పాటు పడ్డారు. 1998 నుంచి మరాఠీల రాకతో ఆలయం అభివృద్ధి పథంలో నడిచే వరకూ ఆలయ నిర్వహణ బాధ్యతను వైశ్యులే చూసుకున్నారు. మొదటి నుంచి ఆలయ కమిటీల్లో వారి సామాజిక వర్గమే ఉంటూ వచ్చింది. ఇదే విషయాన్ని పవన్ కల్యాణ్‌కు వివరించడంతో ఆయన తమకు మాట ఇచ్చినట్లు వారు చెబుతున్నారు. పిఠాపురంలో ఉన్న నాలుగు ప్రధాన ఆలయాల్లో పాదగయ కుక్కుటేశ్వరస్వామి, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానాలకు ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదల కావడంతో చెరో ఆలయ కమిటీని తీసుకునేలా టీడీపీ, జనసేన నిర్ణయించుకున్నట్లు సమాచారం.

హైందవ ధర్మం కోసం పాటు పడుతున్నామంటూ చెప్పుకునే బీజేపీకి హైందవ దేవాలయాల కమిటీల్లో చోటు ఇవ్వకుండా టీడీపీ జనసేనలు కరివేపాకులా తీసి పారేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆలయ కమిటీల నియామకంలో అసలు బీజేపీ ఊసెత్తక పోవడంతో ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. బీజేపీని కేవలం కమిటీ సభ్యులుగా కూడా నియమించడానికి అవకాశం ఇవ్వడం లేదనే వాదనలు వినిపిస్తుండడంతో ఆ పార్టీ నేతలు అమీతుమీ తేల్చుకోడానికి సిద్ధపడుతున్నట్లు సమాచారం.

పాదగయ మాదే అంటున్న టీడీపీ

మార్కెట్ కమిటీ నియామకం సందర్భంగా టీడీపీ, జనసేన మధ్య కుదిరిన పదవుల ఒప్పందంలో భాగంగా మార్కెట్ కమిటీ జనసేన తీసుకుని పాదగయ చైర్మన్ పదవి టీడీపీకి ఇచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. పాదగయ క్షేత్రమైతే ఏ సామాజిక వర్గానికి మాట ఇచ్చింది కాదు కనుక తమకు ఇష్టమొచ్చిన వారికి ఇచ్చుకోవచ్చనే ఉద్దేశంతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ తమకు పాదగయ చైర్మన్ మాత్రమే కావాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. దీంతో మహా సంస్థానం జనసేనకు కేటాయించినట్లుగా చెబుతున్నారు. పాదగయ క్షేత్రానికి ఇప్పటికే మాజీ చైర్మన్‌ను చైర్మన్ అభ్యర్థిగా టీడీపీ నిర్ణయించినట్లు సమాచారం. మహాసంస్థానం చైర్మన్ గిరి కోసం కాపు సామాజిక వర్గానికి చెందిన జనసేన స్థానిక నేతలు ఇప్పటికే పావులు కదిపి చైర్మన్ పదవి తమకు ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు తెలిసింది. ఈ చైర్మన్ పదవి ఆర్యవైశ్యులకు కేటాయించాల్సి ఉండగా కాపు సామాజిక వర్గానికి ఎలా మాట ఇచ్చారని ఆర్య వైశ్య వర్గం జనసేన నేతలపై మండి పడుతున్నారు. ఇక పాదగయ క్షేత్రం తమకు కేటాయించారని టీడీపీ నేతలు బాహాటంగా చెప్పుకుంటుండగా అది కూడా మాదే అంటున్నారు జనసేన నేతలు. పాదగయ క్షేత్రం తమ వారికే కేటాయించాలని నియోజకవర్గ టీడీపీ నేత గట్టిగా తమ అధిష్టానికి అల్టిమేటం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

మహా సంస్థానం మాకొద్దు

శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఎవరు తీసుకోవాలన్న దానిపై ఇరు పార్టీల నేతలు సిగపట్లు పట్టుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మహా సంస్థానం తమకు కేటాయించాలని గతంలో ఆర్యవైశ్యులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణకు, మాజీ ఎమ్మెల్యే వర్మకు వినతిపత్రాలు అందజేశారు. ఇద్దరు నేతలు ఆర్యవైశ్యులకు మీకే కేటాయిస్తామంటూ మాట ఇచ్చారు. ఇప్పుడు ఏ పార్టీ ఈ ఆలయాన్ని తీసుకున్నా వాళ్లు ఆలయ కమిటీ చైర్మన్ పదవి ఆర్యవైశ్యులకు కేటాయించాల్సి ఉంది. దీంతో తమ వర్గీయులకు చైర్మన్ పదవి ఇచ్చుకోవాలంటే పాదగయ మాత్రమే వీలు కుదురుతుందని ఇరు పార్టీ నేతలు మహా సంస్థానం మాకు వద్దంటే మాకు వద్దని చెబుతున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇప్పటికే రెండు పార్టీలకు చెందిన ఆశావహుల్లోను ఆధిపత్య పోరు పెరగడంతో వారిని సముదాయించే పనిలో ఉన్నారు.

మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలి



రైల్వే స్టేషన్ మేనేజర్ ఆధ్వర్యంలో ట్రాక్‌ల మధ్య డ్రైన్‌ను శుభ్రం చేస్తున్న రైల్వే సిబ్బంది

సామర్లకోట: ప్రతి ప్రాంతంలోని డ్రైన్లు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం .రమేష్ అన్నారు. స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలోని రైల్వే ట్రాకు మధ్యలో ఉన్న చెత్తను తొలగించడంతో పాటు పట్టాల మధ్యలో ఉన్న డ్రైన్లను శుభ్రం చేయించారు. ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న మరుగుదొడ్లతో పాటు దివ్యాంగులకు చెందిన మరుగుదొడ్లను ఆయన పరిశీలించి శుభ్రం చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు తినుబండారాలకు చెందిన కాగితాలను, చెత్తను డస్ట్ బిన్లలో మాత్రమే వేయాలన్నారు. డ్రైన్లలో వేయడం నేరమని హెచ్చరించారు. మరుగుదొడ్లను ఉపయోగించిన సమయంలో వాటిని శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ నెల 15 వరకూ జరిగే స్వచ్ఛ పక్షోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి తదితరులు పాల్గొన్నారు.



గుర్రపు బండిపై పెళ్లి కొడుకు ఊరేగింపు

భలేగా.. పెళ్లి సందడి

సామర్లకోట: పెళ్లి... ఈ వేడుకలో ప్రతి ఒక్కరూ తమ ప్రత్యేకత చాటాలనుకుంటారు. ఎవరికి తోచిన రీతిలో వారు ఆర్భాటం చేస్తుంటారు. గురువారం సాయంత్రం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమలకంటి శ్రీనివాసు కుమారుడి వివాహం సందర్భంగా స్థానికంగా గుర్రపు బండిపై పెళ్లి కుమారుడిని ఇలా ఊరేగించారు. ఇది జనాన్ని ఆకట్టుకుంది.

పెద్దాపురం పట్టు వస్త్రాలకు గుర్తింపు



చేనేత కార్మికులకు ముద్ర రుణాలను అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పెద్దాపురం: స్థానిక చేనేత పట్టు వస్త్రాలకు మంచి గుర్తింపు ఉందని, ఆ ఖ్యాతిని దేశ వ్యాప్తంగా చాటేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. గురువారం స్థానిక ముప్పన రామారావు చేనేత సహకార సంఘ భవనంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం విద్యుత్ రాయితీ కల్పిస్తుందన్నారు. అనంతరం 50 మంది చేనేత కార్మికులకు ముద్ర రుణాల కింద రూ. కోటి చెక్కును కలెక్టర్ అందజేశారు. ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, చేనేత జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జయశంకర్ పాల్గొన్నారు.

నిలిచిపోయిన లారీ

- ట్రాఫిక్‌కు అంతరాయం



క్రేన్‌తో సిమెంట్ లోడ్ లారీని పక్కకు లాగుతున్న దృశ్యం

సామర్లకోట: మండలంలోని మాధవపట్నం రైల్వే గేటు రోడ్డులో గురువారం సాయంత్రం సిమెంట్ లోడు లారీ సాంకేతిక లోపంతో రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. మాధవపట్నం నుంచి సర్పవరం వెళ్లే రోడ్డు సింగిల్ వే కావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మూడు క్రేన్లను తెప్పించి మాధవపట్నం గేటు వద్ద నిలిచిపోయిన లారీని సర్పవరం రోడ్డులోని ఖాళీ ప్రదేశం వరకూ తీసుకు వెళ్లడంతో సమస్య పరిష్కారమైంది.

ట్రస్టు బోర్డు కోసం దరఖాస్తుల స్వీకరణ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయడానికి భక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం గురువారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 20 రోజుల్లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సామర్లకోట: స్థానిక బడేలమ్మ చెరువు వద్ద వేంచేసి ఉన్న నవదుర్గ ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఏర్పాటు చేశామని ఆలయ ధర్మకర్త కనక విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సామూహిక వ్రతాలతో పాటు ఆలయంలో హోమం జరుగుతాయన్నారు. సామూహిక వ్రతాల్లో పాల్గొనే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. వీరితో పాటు అమ్మవారిని దర్శించుకునే భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తామన్నారు.

లీకులతోనే కుళాయిల నుంచి నాచు నీరు

- గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు



లీకవుతున్న ప్రధాన పైపులైన్‌ను పరిశీలిస్తున్న డీఈ, ఏఈలు

సామర్లకోట: పాత సామర్లకోట ప్రాంతాలకు వారం రోజులుగా నాచు రంగులో నీరు రావడంతో అధికారులు ఆ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన పైపులైన్‌పై దృష్టి సారించారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం సమీపంలోని బడేలమ్మ చెరువు వద్ద ప్రధాన పైపులైన్‌కు లీకు ఏర్పడినట్లు ఇంజినీరింగ్ అధికారులు గురువారం గుర్తించారు. బడేలమ్మ చెరువులో చేపల వేట సాగించడానికి చెరువులో నీటిని బయటకు ఒకేసారి వదలి వేయడంతో తాగు నీటి ప్రధాన పైపులైన్ పాడైందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. చెరువులో నాచుతో నిండిపోయిన నీరు ప్రధాన పైపులైన్ ద్వారా కుళాయిల నుంచి వచ్చిందన్నారు. చేపల వేట సాగించే మత్స్యకార సంఘానికి చెందిన చెరువు వద్ద మోటారు పాడై పోవడంతో నీటిని అవుట్‌లెట్ ద్వారా విడిచి పెట్టడంతో విమల్ బాట్లింగ్ వద్ద ఉన్న కల్వర్టు దిగువ భాగంలో పైపులైన్ ధ్వంసం అయినట్లు గుర్తించారు. ఫిల్టర్ బెడ్ నుంచి స్వచ్ఛమైన తాగు నీరు విడుదల చేస్తున్నా మున్సిపల్ కుళాయిల నుంచి నాచు రంగులో నీరు రావడంతో మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇంజినీరింగ్ శాఖకు చెందిన అధికారులు తలలు పట్టుకున్నారు. పైపులైన్ లీకు పనులను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. జేసీబీ సాయంతో తుప్పలను తొలగించి లీకుల నివారణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ కె.శశిధర్, ఏఈ నరసింహారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కొత్తపల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

కొత్తపల్లి: చేనేత కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కొత్తపల్లి చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు యర్ర శ్రీనివాస్ కోరారు. మండలంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మూలపేట, ఉప్పాడ, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లికి చెందిన చేనేత కార్మికులు ఉప్పాడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దారు చిన్నారావు, ఇంచార్జి ఎంపీడీఓ హరికృష్ణారెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం

చేనేత కార్మికులకు సత్కారం

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కుతుకుడుమిల్లిలో చేనేత కార్మికులను సత్కరించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రావు అక్షయ్ స్వగృహం వద్ద చేనేత కార్మికులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. చేనేత కార్మికుల సమస్యలను కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళతామని ఆయన తెలిపారు.

ముంధర హడల్

- కొండెక్కిన పూజా సామగ్రి
- వరలక్ష్మీ వ్రతాలకు ధరాఘాతం



బంగారు వరలక్ష్మీ రూపులను కొనుగోలు చేసేవారు లేక వెలవెలబోతున్న ఓ దుకాణం



సామర్లకోటలో పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: వరాలిచ్చే కల్పవల్లి వరలక్ష్మి.. శ్రావణ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం మహిళలు వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తుంటారు.. నేడు జరిగే ఈ పూజ సామాన్యులకు ఇబ్బందిగా మారింది.. ఎక్కడికక్కడే కొండెక్కిన ధరలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.. బంగారంతో పాటు పిండి వంటలకు ఉపయోగించే సామగ్రి, పండ్లు, పూల ధరలు మండిపోతున్నాయని మహిళలు ఆవేదన చెందుతున్నారు. పిండి వంటలు తయారు చేయడానికి నూనె, బెల్లం, పిండి ధరలు మండిపోతున్నాయని వాపోతున్నారు. బంగారు రూపు కొనాలంటే సామాన్యులకు సాధ్యం కావడం లేదు. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. లక్ష్మీదేవి సంపదల తల్లి అని పేరు ఉంది. దాంతో ప్రతి మహిళ శ్రావణ మాసంలో వచ్చే ఏదో ఒక శుక్రవారం తప్పనిసరిగా వరలక్ష్మీ వ్రతం చేస్తుంటారు. ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రతం చేసుకోవడానికి అవకాశం లేదని వారి కోసం ఈ నెల 15న సామర్లకోటలోని పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలకు ఏర్పాట్లు చేశారు.

మార్కెట్ కళకళ

నియోజకవర్గ పరిధిలోని మార్కెట్‌లు పూజా సామగ్రి విక్రయాలతో కిటకిటలాడాయి. పెద్దాపురం మున్సిపాలిటీలో మెయిన్ రోడ్డు వెంబడి, సామర్లకోట మఠం సెంటర్, దేవీచౌక్ సెంటర్లలో వరలక్ష్మీ వ్రతాలకు ఉపయోగించే పత్రి, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, వరలక్ష్మీదేవి ఫోటోలు విక్రయించే షాపులు ఏర్పాటు చేశారు. గురువారం ఒక్కసారిగా కుంభవృష్టిగా వర్షం కురవడంతో చిరు వ్యాపారులు బెంబేలెత్తిపోయారు. అయితే 20 నిమిషాల తరువాత వర్షం తగ్గడంతో ఊపిరిపీల్చుకున్నారు. వరలక్ష్మీ వ్రతం చేసే మహిళలు తప్పనిసరిగా చామంతి పూజలతో పూజలు చేయాలనేది ఆచారం. చామంతి పువ్వు ఒకటి రూ. ఐదుకు విక్రయిస్తున్నారు. ఇక పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. కిలో నూనె గతంలో రూ.115 ఉండగా, ప్రస్తుతం రూ.145కి చేరింది. పూజ తరువాత తోరణంగా చేతికి కట్టుకొనే చామంతి పూల రేట్లు మండిపోతున్నాయి. జామకాయలు, యాపిల్స్, బత్తాయి, దానిమ్మ కాయల ధరలు భారీగా పెరిగాయి. ఇక పిండి వంటలకు ఉపయోగించే నూనె, బెల్లం, పప్పుల ధరలు ఆకాశాన్నంటాయని మహిళలు వాపోతున్నారు. గత ఏడాది గ్రాము బంగారం రూ.7,700 ఉండగా, ప్రస్తుతం రూ.10,330కి చేరిందని మహిళలు భయపడుతున్నారు. దాంతో కొనేవారు లేక బంగారు దుకాణాలు వెలవెలబోయాయి.

మండిపోతున్న ధరలు



వరలక్ష్మీ వ్రతం వచ్చిందంటే బంగారం రూపు, చీరలు కొనుగోలు చేస్తుంటాం. సామాన్యులు బంగారు రూపులను కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. బంగారం ధరలు భారీగా పెరిగిపోయాయి. వెండి రూపులను కొనుగోలు చేసి పూజలు చేసుకొంటున్నాం. పూజకు ఉపయోగించే చామంతి పువ్వు ఒకటి రూ.5కి విక్రయించడం దారుణం. నూనె ధరలూ మండిపోతున్నాయి.

– కర్రి వెంకటలక్ష్మి, గృహిణి, సామర్లకోట

పూజా సామగ్రి	గత నెలలో (రూ.)	ప్రస్తుతం (రూ.)
డజను అరటి పండ్లు	30	40
కొబ్బరికాయ	20	35
ఒక చామంతి పువ్వు	2	5
డజను జామకాయలు	100	200
డజను యాపిల్స్	150	250
డజను దానిమ్మ	150	300
డజను బత్తాయిలు	100	200
కిలో వంట నూనె	120	145
కిలో బెల్లం	50	60
కిలో శెనగలు	80	100
కిలో మినపపప్పు	90	100
కిలో పెసరపప్పు	100	120

మొరాయించిన సర్వర్లు



సర్వర్లు మొరాయించడంతో వేచి ఉన్న ప్రయాణికులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో సర్వర్లు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. రిజర్వేషన్ల టిక్కెట్ల కోసం వేచి ఉన్న ప్రయాణికులకు సరైన సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. రైల్వే బుకింగ్ కౌంటర్లతో పాటు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన మెషీన్లు కూడా పనిచేయలేదు. అయితే బుకింగ్ కౌంటర్ల వద్ద ప్రయాణికులు బారులు తీరారు. దీనిపై స్టేషన్ మేనేజర్ ఎం .రమేష్‌ను వివరణ కోరగా కేవలం 10 నిమిషాలు జోనల్ వైడ్ సర్వర్లు నిలిచిపోవడంతో కొద్దిగా సమస్య ఏర్పడిందన్నారు. ప్రయాణికులకు సంబంధించిన ఎటువంటి రైలు మిస్ కాలేదన్నారు. వెంటనే టెక్నికల్ అధికారులు సమస్యను పరిష్కరించారన్నారు. సర్వర్లు పనిచేసిన వెంటనే అదనపు కౌంటర్లతో ప్రయాణికులకు టిక్కెట్లు ఇచ్చామని తెలిపారు.

అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గమ్మ

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణ మాస జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం అన్నార్తుల ఆకలి తీర్చే అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ఒక చేతిలో అక్షయపాత్ర, మరో చేతిని అభయహస్తంగా చూపుతూ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.